సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 27 । జూన్ । 2025

న్యూస్‌రీల్

పెండింగ్ కేసులు పరిష్కరించండి



న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు జిల్లా కోర్టులో న్యాయమూర్తులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పాత కేసులన్నీ పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జయప్రసాద్, వినోద్‌కాంబ్లే, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ గురువారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేటలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు మొదటి రోజు 289 మంది విద్యార్థులు హాజరయ్యారు. సర్టిఫికెట్లు పరిశీలించిన అధికారులు ఐడీ పాస్‌వర్డు అందజేశారు. ప్రిన్సిపాల్ గోవర్దన్ మాట్లాడుతూ ఐడీ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ప్రధానికి లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమం



అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్ట్ కార్డులు రాసిన నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఆర్బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురాం డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ప్రధానికి లక్ష పోస్ట్ కార్డ్‌ల ఉద్యమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 23న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన కార్యక్రమం గురువారం పట్టణ కేంద్రానికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ప్రధాని మోదీకి పోస్ట్ కార్డులు రాశారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ అంబేడ్కర్ సూచనలతోనే 1935 ఏప్రిల్ 1 రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏర్పాటైందన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 500 మందితో పోస్ట్ కార్డ్స్ వేయించామన్నారు. 26 జనవరి 2026 వరకు ప్రధానికి లక్ష మందితో పోస్ట్‌కార్డ్‌లు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జిల్లా కన్వీనర్ మేడిపల్లి చందు, మాజీ కౌన్సిలర్ చంటి, మాజీ సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



చిన్నకోడూరులో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి రాధిక

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని చిన్నకోడూరు, గంగాపూర్, రామంచ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నకిలీ విత్తనాలను రైతులకు విక్రయించవద్దన్నారు. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు అమ్మాలని ఆదేశించారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు. యూరియాను అవసరం మేరకు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

మత్తు వదిలిద్దాం.. మహమ్మారిని తరిమేద్దాం



విద్యార్థులతో కలిసి ర్యాలీలో నడుస్తున్న కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు



సిద్దిపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హైమావతి, సీపీ డాక్టర్ అనురాధ

- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- కలెక్టర్ హైమావతి పిలుపు
- జిల్లా వ్యాప్తంగా డ్రగ్స్‌పై కదంతొక్కిన జనం

సిద్దిపేటఎడ్యుకేషన్/హుస్నాబాద్: 'మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం.. మహమ్మారిని తరిమేద్దాం.. మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు' అని కలెక్టర్ హైమావతి పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు జరిగాయి. సిద్దిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(కోఎడ్యుకేషన్) నుంచి ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులచే పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీని సీపీ అనురాధతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తుకు బానిసలుగా మారిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు బాధితులకు అవగాహన కల్పించాలన్నారు. స్నేహితులు, బంధువులు సన్మార్గంలో నడిచేలా యువత బాధ్యతవహించాలన్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

పోలీస్ కమిషనర్ అనురాధ మాట్లాడుతూ పాఠశాలల్లో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై వివరిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా డ్రగ్స్ కలిగి ఉన్నా, తీసుకున్నా వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1908కు లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. పాత బస్టాండ్ సర్కిల్ వద్ద డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నె రవీందర్‌రెడ్డి, అదనపు డీసీపీ సుభాష్‌చంద్ర బోస్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

మానవహారం..

హుస్నాబాద్ పట్టణంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాదవద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత అని అన్నారు. అంతకు ముందు విద్యార్థులు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ పట్టణంలో విద్యార్థుల మానవహారం

పైరవీలకే పోస్టులు

గెస్ట్ లెక్చరర్ల నియామకాల్లో అక్రమాలు

- ఆయా సబ్జెక్టులకు 42 మంది నియామకం
- మెరిట్ లిస్ట్ ప్రదర్శించకుండానే ఎంపికలు
- అవకతవకలపై సర్వత్రా విమర్శలు
- 9 కేజీబీవీల్లో నూతనంగా ఇంటర్ విద్య ప్రారంభం

తొగుట, కొమురవెల్లిలో గెస్ట్ అధ్యాపకురాలి పోస్టుకు ఓ మహిళా దరఖాస్తు చేశారు. రెండు చోట్లా ఎంతో కష్టపడి వేర్వేరుగా డెమో ఇచ్చారు. అయినా ఫలితం దక్కలేదు. అయితే ఎలాంటి మెరిట్ లిస్ట్ ప్రదర్శించకుండానే గెస్ట్ లెక్చరర్ల నియామకం చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైరవీలు చేసుకున్న అభ్యర్థులనే నేరుగా పిలిచి ఎంపిక చేశారని తెలుస్తోంది. పోస్టుల నియామకాల్లో జరిగిన అవకతవకలపై అధికారులు దృష్టి సారించాలని డెమోకు హాజరైన అభ్యర్థులు కోరుతున్నారు. – సాక్షి, సిద్దిపేట



కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) లలో గెస్ట్ లెక్చరర్ల నియామకాల్లో పైరవీలకే పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధ్యాపకుల నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. జిల్లాలో 9 కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయంతో 42 గెస్ట్ లెక్చరర్ల నియామకం చేపట్టారు. అర్హులను కాకుండా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పిన వారికే అవకాశాలు కల్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు మరోసారి పరిశీలించాలని డెమోకు హాజరైన అభ్యర్థులు కోరుతున్నారు.

16 కేజీబీవీలలో..

జిల్లా వ్యాప్తంగా 23 చోట్ల కేజీబీవీలుండగా గతేడాది వరకు ఏడు చోట్ల మాత్రమే ఇంటర్ విద్యను అందించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మరో 9 కేజీబీవీలలో ఇంటర్మీడియెట్ విద్యను ప్రారంభించారు. దీంతో ఇంటర్ విద్యను అందించే కేజీబీవీలు 16కు చేరాయి. నూతనంగా ఇంటర్ విద్యను అందించేందుకు కొమురవెల్లి, వర్గల్, ములుగు, అక్కన్నపేట, హుస్నాబాద్, తొగుట, అల్లీపూర్(చిన్నకోడూరు) కేజీబీవీలలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్లను నియమించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఆయా కేజీబీవీల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించారు. 42 గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దాదాపు 150కి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

పైరవీలకే ప్రాధాన్యత

కేజీబీవీలలో గెస్ట్ లెక్చరర్ల ఎంపికల్లో పైరవీలకే ప్రాధాన్యత ఇచ్చారని తెలుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక మాజీ ప్రతినిధులు చెప్పిన వారికే అవకాశాలు కల్పించారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి అవసరమైతే మరోమారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్యాపకుల సమక్షంలో డెమో నిర్వహించి ఎంపికలు చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు. దీనిపై త్వరలో కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరనున్నట్లు తెలుస్తోంది.

మెరిట్ లిస్ట్ లేకుండానే..

అర్హత ఆధారంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులతో సబ్జెక్ట్ నిష్ణార్థులు, ఎంఈవో, ఎస్‌వోల సమక్షంలో డెమో చెప్పించారు. క్లాస్ చెబుతుంటే ఎలాంటి వీడియో చిత్రీకరించలేదు. ఎలాంటి మెరిట్ లిస్ట్‌ను ప్రదర్శించకుండానే నేరుగా అభ్యర్థులకే సమాచారం అందించి సెలెక్ట్ చేశారు. దీంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపికలు నిష్పక్షపాతంగా జరగలేదని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు.

పారదర్శకంగానే ఎంపికలు



కేజీబీవీలలో గెస్ట్ లెక్చరర్ల ఎంపికలు పారదర్శకంగా జరిగాయి. అవకతవకలకు అవకాశాలు లేవు. అభ్యర్థులు ఇచ్చిన డెమో ప్రకారం ఎంఈవో, ఎస్‌వో, ఆ సబ్జెక్ట్ నిష్ణార్థుడు సమక్షంలో ఎంపిక చేశారు

–శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

హుస్నాబాద్‌లో నేడు మంత్రుల పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

హుస్నాబాద్: పట్టణంలో శుక్రవారం నలుగురు మంత్రులు పర్యటించనున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఏర్పాట్లను గురువారం కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉదయం 11.30 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రూ.11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు సంక్షేమ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఇదే ప్రాంగణంలో ఉన్న 100 పడకల ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.82 కోట్లతో నిర్మించనున్న 150 పడకల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రూ.77.20 కోట్లతో నిర్మిస్తున్న నాలుగు లేన్ల రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే సమావేశంలో మంత్రులు పాల్గొంటారు.

వసతి గృహాల్లో వసతులు కల్పించండి

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతు నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా హాస్టళ్లలో కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ విద్య అభ్యసించడం అంటే సమస్యలతో సతమతమవడమనే విధంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ విద్యాసంస్థలు, హాస్టళ్ల మాత్రం మారడం లేదని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో హాస్టల్ విద్యార్థులకు రావలసిన బెడ్డింగ్, స్టడీ మెటీరియల్స్ రాకపోవడంతో తల్లిదండ్రుల మీద అదనపు భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు నాచారం శేఖర్, జిల్లా అధ్యక్షుడు గుడి కందుల రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వడ్డీ రాకాసులు

- పేదల నడ్డి విరుస్తున్న ప్రైవేటు ఫైనాన్స్‌లు
- వారి ఆగడాలను అరికట్టాలంటున్న ప్రజలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రైవేటు ఫైనాన్స్‌లు పేదల నడ్డి విరుస్తున్నాయి. పేద ప్రజల అమాకత్వాన్ని, అవసరాలను ఆసరాగా తీసుకుని అప్పులు ఇచ్చి వడ్డీల పేరుతో నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సిద్దిపేటకు చెందిన ప్రైవేటు ఫైనాన్స్‌లు గ్రామాల్లో వారం, నెల రోజులు వారీగా మిత్తీలకు ఇస్తూ పేదలను హింసుస్తున్నారు. మహిళల పేరు మీద మహిళా గ్రూపులు ఏర్పాటు చేస్తూ వారం చిట్టీలు నడిపిస్తున్నారు. పది మందిని ఒక గ్రూపుగా చేసుకుంటూ నెలలో ఒక మొదటి వారాన్ని ఎంచుకుని డబ్బులు వసూలు చేస్తున్నారు. పది మందిలో ఆపద ఉండి ఎవరైనా డబ్బులు చెల్లించలేకపోతే వారి ఇళ్లపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. అధిక వడ్డీతో డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో కుటుంబ కలహాలతో వారం క్రితం ఒక వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతను చెల్లించాల్సిన రూ.3 వేల కోసం గురువారం అతని ఇంటిపై సిద్దిపేటకు చెందిన ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. అధికారులు స్పందించి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాచాపూర్‌లో ఓ ఇంటి ఎదుట ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది దౌర్జన్యం

నిర్దేశించిన రుణాల లక్ష్యం సాధించాలి

బ్యాంకర్లకు కలెక్టర్ దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: బ్యాంకర్లకు నిర్దేశించిన రుణాల లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ కె. హైమావతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రియారిటీ సెక్టారైన వ్యవసాయం, మొదలైన రంగాలకు ఇచ్చిన రుణాల లక్ష్యాలను బ్యాంకులు సాధించాలన్నారు. ప్రధానమంత్రి ముద్రయోజన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మొదటగా ఖరీఫ్ సీజన్ కోసం నిర్దేశించిన రుణాలను రైతులకు అందించాలన్నారు. మత్స్య, పశుసంవర్ధక , ఉద్యాన శాఖల ద్వారా బ్యాంకులు ఒకేచోట సదస్సు నిర్వహించి అర్హులైన వారికి కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్డీఓ, ఎల్డీయం, ఇతర బ్యాంక్ అధికారులు, బ్యాంక్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పోలీస్, నేషనల్‌హైవే, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే సిద్దిపేట, కుకునూరుపల్లి, గజ్వేల్, గౌరారం వంటి ప్రాంతాల్లో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

కురిసిన వాన.. మురిసిన రైతన్న



పెద్ద మాసాన్ పల్లిలో దుక్కి దున్నుతున్న రైతు

జిల్లా వ్యాప్తంగా 1081.6 మిల్లీమీటర్ల వర్షపాతం

- నారాయణరావుపేటలో అత్యధికం
- పంటలకు జీవం పోసిన వరుణుడు
- సాగు పనుల్లో అన్నదాతలు బిజీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కురిసిన వర్షాలతో సాగు పనులు ముమ్మరమయ్యాయి. కొద్ది రోజులుగా వర్షాలు లేక మొలకెత్తిన మొలకలు సైతం వాడిపోతుండటంతో దిగులుచెందుతున్న రైతుల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు కురిసిన వర్షాలు సంతోషాలను నింపాయి. జిల్లా వ్యాప్తంగా 1081.6మిల్లీమీటర్లు, సగటున 41.6మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదయ్యింది. అత్యధికంగా నారాయణరావు పేట మండలంలో 90.21మి.మీ, సిద్దిపేట రూరల్ మండలంలో 73.2మి.మీ, సిద్దిపేట అర్బన్ మండలంలో 69.6మి.మీ, కోహెడ మండలంలో 56.3మి.మీ, అక్బర్‌పేట భూంపల్లి మండలంలో 55.8మి.మీ, తొగుట మండలంలో 55.5మి.మీ, దుబ్బాక మండలంలో 53.2మి.మీ, దౌల్తాబాద్ మండలంలో 52.9మి.మీ, అక్కన్నపేట మండలంలో 52.1మి.మీ, చిన్నకోడూరు, బెజ్జంకి మండలాలలో 51.1 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఎండిపోయే దశలో ఉన్న పంటలకు వానలు ఊపిరిపోశాయి. ముందుగానే పంటలపై ప్రణాళిక సిద్ధం చేసుకున్న రైతులకు ఈ వర్షంతో కొండంత ధైర్యాన్ని ఇచ్చాయి. రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయాదారులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు.

వానాకాలం సీజన్‌లో సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	ఇప్పటి వరకు సాగైన పంటలు
వరి	614
మొక్కజొన్న	9,145
పత్తి	51,510
కందులు	553
పెసర్లు	36

పంటకు ప్రాణం



నాకున్న భూమిని సాగుకు సిద్ధం చేసి, ప్రారంభంలో వర్షం పడగానే విత్తనాలు వేశాను. ఆ తరువాత వానలు లేకపోవడంతో బాధపడ్డాను. కొద్ది రోజులగా వానలు కురవడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది.

– అనిమెల అభి, రైతు, తొగుట

క్లుప్తంగా

గాయపడ్డ నెమలికి చికిత్స



నెమలిని అటవీ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

శివ్వంపేట(నర్సాపూర్): గాయపడిన నెమలికి అటవీ సిబ్బంది చికిత్స చేయించారు. గురువారం మండల పరిధిలోని గోమారం గ్రామ శివారులో వెంకట్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీ ఫామ్ వద్ద ఓ నెమలి గాయపడి ఉండగా గుర్తించిన రైతు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శివ్వంపేట ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్, బీట్ అధికారి శ్రీవల్లి గాయపడిన నెమలిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నెమలికి నర్సాపూర్‌లో పశు వైద్యశాలలో చికిత్స చేయించి అడవిలో వదిలిపెట్టారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన మాదగారి రేగొండకు భార్య మంజులతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు. తమకున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగానే భార్యాభర్తలు వ్యవసాయ పొలానికి వెళ్లారు. మంజుల పొలంలో పనిచేస్తుండగా, రేగొండ సమీపంలోని చింతచెట్టుకింద పడుకున్నాడు. మంజుల కొద్దిసేపటి తర్వాత రేగొండ వద్దకు వెళ్లి చూడగా పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించింది. అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

సామాజిక చైతన్య స్ఫూర్తి కల్పిస్తాం

సిద్దిపేటజోన్: తెలంగాణ ప్రాంతంలో నెలకొన్న అనేక సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించేలా ఇండస్ట్రీ ముందుకు సాగనుందని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఆడిటోరియంలో ఇండస్ట్రీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జులై నెలాఖరులో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి, అదనపు వరకట్నం వేధింపులు, మహిళలపై దాడులతోపాటు ప్రజల్లో అవగాహన లేక జరుగుతున్న అనేక అంశాలను క్రోడీకరించి త్వరలో సిద్దిపేటలో భారీ ప్రదర్శన చేపట్టనున్నట్టు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి సత్తార్, ఇన్‌చార్జి రాజేష్ మాట్లాడుతూ.. మరొక సామాజిక ఉద్యమానికి ఇండస్ట్రీ నాంది పలికిందన్నారు.కార్యక్రమంలో ప్రతినిధులు తేలు విజయ, రమేష్,నర్సింహులు, జెఎల్ నాందేవ్, గణేష్, శంకర్ బాబు, శాంతిరాజ్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మెదక్ మున్సిపాలిటీ: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజారెడ్డి వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 మొబైల్స్, రూ. 8,765 నగదు ను స్వాధీనం చేసుకుని మెదక్ టౌన్ ఎస్ఐకి అప్పగించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దాడి చేసినట్లు తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రంగాకృష్ణ వివరాల ప్రకారం... అల్లాపూర్ సమీపంలో ఓ వెంచర్‌లో పేకాటాడుతున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10700, మూడు బైకులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రణాళిక.. ప్రహసనం

కానరాని కార్యాచరణ - ఎక్కడి చెత్త అక్కడే

- మున్సిపాలిటీల్లో తాండవం చేస్తున్న సమస్యలు
- విఫలమైన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పురపాలికల్లో వందరోజుల ప్రణాళిక సరిగా అమలవ్వడం లేదు. వెరసి మురుగునీటి కాలువల అపరిశుభ్రత, చెత్త తరలింపులో నిర్లక్ష్యం, మురుగు గుంతలు, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు, తదితర పనులు చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు పకడ్బందీ ప్రణాళికతో మున్సిపాలిటీల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జోగిపేట(అందోల్): పట్టణంలోని భరత్ నగర్ కాలనీకి వెళ్లే దారిలో గల పార్కు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ పార్కు మున్సిపల్ కార్యాలయం ప్రక్కనే ఉండటం గమనార్హం. గాంధీ పార్కుకు తాళం వేయడం వల్ల అందులో చెత్త పేరుకుపోయింది. జోగిపేట-అన్నాసాగర్ వెళ్లే రహదారి ప్రక్కనే చెత్త పేరుకుపోయింది. వంద రోజుల ప్రణాళిక తూతూ మంత్రంగా నిర్వహించారని పలువురు ఆరోపిస్తున్నారు. 20 వార్డులను టార్గెట్ చేసి పనులు చేపట్టినా పారిశుధ్యం, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు.



జోగిపేట(అందోల్): రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

ప్రణాళిక అమలేది?



మురుగుతో నిండి చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక ముందుకు సాగడం లేదు. అక్కడక్కడ మొక్కుబడి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనంతరం వీధుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పట్టణంలోని చెరువులు, ఎంఎన్ కెనాల్ పారిశుధ్య లోపంతో కంపుకొడుతున్నాయి. మల్లం చెరువు కట్టపై చెత్త పేరుకుపోయింది. ఎంఎన్ కెనాల్‌లో పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయి కంపు కొడుతోంది. కాలనీల్లోని మురుగు కాల్వలు సైతం ఇదే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అవగాహన కల్పిస్తే.. ఇలా చేస్తారా?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నామమాత్రంగా ప్రణాళిక నిర్వహిస్తున్నారు. మొత్తం యాక్షన్‌ప్లాన్‌లో 50 అంశాల్లో పారిశుధ్యం ఒకటి. తడి, పొడి చెత్తపై మాత్రం అవగాహన కూడా కల్పించడం లేదు. పలుచోట్ల చెత్తను బహిరంగంగా తగలబెడుతున్నారు. పారిశుధ్యంపై కాలనీలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ మున్సిపల్ పరిధిలో అమలు కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు పక్కన తగులబెడుతున్న చెత్త



దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీ వద్ద అధ్వానంగా చెత్తకుప్పలు



దుబ్బాకలో టీటీడీ కల్యాణమండపం సమీపంలో దర్శనమిస్తున్న చెత్త

పారిశుధ్య పనుల్లో నిర్వహణ లోపం..

దుబ్బాక: మున్సిపాలిటీలోని 20 వార్డులలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం డ్రైనేజీ శుభ్రం చేసే పనులు కూడా సరిగా చేయడం లేదు. వార్డులలో ప్రజలకు తడి,పొడి చెత్త, వానాకాలంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రూ.20 కోట్ల నిధులు వస్తే సమస్యలు తీరుతాయని, అవి లేకే సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ఉన్న సమస్యలు అధికారులు నోటీపై చేసుకుంటున్నప్పటికీ అవి ఎంత వరకు పరిష్కారం అవుతాయో.. చూడాలని ప్రజలు వాపోతున్నారు.

వృద్ధి చెందుతున్న దోమలు



పిల్లల పార్కులోని భగీరథ ట్యాంకు వద్ద వాల్వుల చుట్టూ నిలిచిన మురుగు

నర్సాపూర్: మున్సిపాలిటీలో మురికి కాలువల శుభ్రం, పిచ్చి మొక్కలు తొలగింపు, భగీరథ పథకం నీటి ట్యాంకుల క్లోరినేషన్ చేయడం తదితర పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ ఆ పనులను సక్రమంగా చేపట్టక పోవడం గమనార్హం. పిల్లల పార్కులోని మిషన్ భగీరథ ట్యాంకు నీరు లీకవుతుంది. వాల్వుల వద్ద మురికి కూపంగా తయారైంది. సునీతారెడ్డి కాలనీలో డ్రైనేజీ నిర్మించకపోవడంతో మురికి నీరు నేలపై పారి పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు పెరగుతున్నాయని కాలనీ వాసులు చెప్పారు

స్కూల్ బకాయి ఫీజులు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకం కింద డే స్కాలర్, రెసిడెన్షియల్‌లో జిల్లాలోని ఎనిమిది ప్రైవేటు పాఠశాలల్లో 578 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిపారు. మూడేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు తల్లిదండ్రులను వేధిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న రూ.3కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, జిల్లా అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి తిరుపతి పాల్గొన్నారు.

దేవాలయంలో నగల అపహరణ

కొండపాక(గజ్వేల్): దుర్గమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సుమారు 20 వేల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు అమ్మవారి చీరను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... గ్రామంలో ఉన్న అమ్మవారి దేవాలయంలో ధూప, దీప నేవేద్యాల సమర్పణ అనంతరం బుధవారం రాత్రి మూసివేశారు. గురువారం ఆలయ దర్వాజ తెరిచి ఉండటం చూసిన వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. వెళ్లి చూడగా బంగారు, వెండి ఆభరణాలతో పాటు చీరను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీంతో పాటు దేవాలయం ఆవరణలో, సమీపంలోని కొందరి ఇండ్ల వద్ద వండిన అన్నం చల్లారు. ఈ విషయమై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

చేపల కోసం వెళ్లి.. స్తంభాన్ని ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



సార్ల రాంచరణ్

కొమురవెల్లి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సార్ల రామ్‌చరణ్(16) అదే గ్రామంలో 10 వతరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఆంజనేయులుతో కలిసి కొమురవెల్లి చెరువులో చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. చెరువులో చేపలు పడకపోవడంతో తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కొమురవెల్లి నుంచి తిమ్మారెడ్డిపల్లి వెళ్లే రోడ్డులో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనాన్ని తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



వినోద్ కుమార్

కంది(సంగారెడ్డి): వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం ప్రకారం... కందికి చెందిన కోస్కే వినోద్ కుమార్ గౌడ్(22) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి కందిలో దాబాకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో పటాన్ చెరు వైపు నుంచి సంగారెడ్డికి వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు..

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నేపాల్‌కు చెందిన మూసారహు సాదే (55) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం వచ్చి పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి వాష్ రూమ్‌కి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు కిందపడి తలకి గాయమైంది. తోటి కార్మికులకు చెప్పగా ఇస్నాపూర్‌లో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మూసారహు సాదే

మంగోల్‌లో గుర్తు తెలియని మృతదేహం

కొండపాక(గజ్వేల్): గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం మండలంలోని మంగోల్ గ్రామంలో కనిపించింది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గ్రామంలో 15 రోజులుగా గుర్తు తెలియని వృద్ధుడు భిక్షాటన చేస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి బస్టాప్ వద్ద పడుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

- కుమారులు సరిగా చూడటం లేదనా..
- అనారోగ్య సమస్యతో ఆత్మహత్యనా?



పూదరి కనకవ్వ

అక్కన్నపేట(హుస్నాబాద్): చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన గురువారం సాయంత్రం మండలంలోని అంతక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పూదరి కనకవ్వ(70)కు నలుగురు కుమారులు ఉన్నారు. అందులో ఒక కుమారుడు కరీంనగర్‌లో ఉంటున్నాడు. మిగిలిన కుమారుల వద్ద ఆమె ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కుమారులు సరిగా పట్టించుకోకపోవడంతో పాటు అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. అనార్యోగ సమస్య తట్టుకోలేకనా? లేక కుమారులు సరిగా చూడటం లేదని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి తరలించారు. వృద్ధురాలి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై సాక్షి ఎస్ఐ విజయ్‌భాస్కర్‌ను సంప్రందించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తునికిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎతిరాజుల సుశీలకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు నర్సాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా చిన్న కొడుకు యాదగిరి(32) తునికిలో తల్లి వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. తల్లి కూలీపనులు చేస్తూ పోషిస్తుంది. పలుమార్లు మద్యం సేవించి తల్లితో సైతం గొడవపడేవాడు. గురువారం తల్లి గ్రామంలోకి వెళ్లొచ్చేసరికి ఇంట్లో యాదగిరి ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య పదేళ్లక్రితం చనిపోయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు కూలగొట్టి రోడ్డున పడేశారు

- పెట్రోలు డబ్బాతో దివ్యాంగుడి ఆందోళన
- డబుల్ బెడ్రూం నుంచి వెళ్లిపోవాలని లబ్ధిదారుల ఒత్తిడి

గజ్వేల్‌రూరల్: రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించిన గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోకుండా తాత్కాలికంగా డబుల్ బెడ్రూంలను కేటాయించి చేతులు దులుపుకున్నదని బాధితులు పేర్కొన్నారు. పెట్రోల్ డబ్బా పట్టుకొని ఆత్మహత్యే శరణ్యమంటూ ఓ దివ్యాంగుడు ఆందోళనకు దిగాడు. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో రోడ్డు వెడల్పులో భాగంగా గత ప్రభుత్వ పాలనలో 19 మందికి చెందిన ఇళ్లను తొలగించేందుకు అధికారులు సిద్ధమవగా, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి బాధితులకు నచ్చజెప్పి సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలలోకి పంపించారు. అక్కడ మొదటి అంతస్తులో ఇళ్ల కేటాయించారు. కానీ, దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 9 మంది బాధితులకు ఉండేందుకు అనుమతించారు. కాగా డబుల్ లబ్ధిదారులు వచ్చి ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాధిత దివ్యాంగుడు నాగరాజు పెట్రోల్ డబ్బా, అగ్గిపెట్టెను చేతిలో పట్టుకొని ఆందోళనకు దిగాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సైదా ఘటనా స్థలానికి వెళ్లి నచ్చజెప్పారు. బాధితులందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగరాజు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో తమ ఇండ్లను తొలగించారని, ప్రస్తుత ప్రభుత్వం ఆదుకొని గూడు కల్పించాలని కోరాడు.



అంబేద్కర్ చౌరస్తా వద్ద పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగిన దివ్యాంగుడు నాగరాజు

లోన్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు

సైబర్ నేరస్తుడి అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): లోన్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ పి.నీరేష్ కేసు వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుగొండ మండలానికి చెందిన పిల్లెల శ్రీకాంత్ తెలంగాణ రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అందులో చేరేలాగా చేసిన శ్రీకాంత్ జాతీయ రియల్ ఎస్టేట్ సంఘం నుంచి రుణాలు వస్తాయని, అందుకు సభ్యత్వ రుసుము రూ. 25 వేలు చెల్లించాలని గ్రూపులో పోస్ట్ చేశాడు. ఇది నిజమేనని నమ్మిన మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనకు లోన్ కావాలని వాట్సాప్‌లో అడిగాడు. వెంటనే అతనికి ఫోన్ చేసి సభ్యత్వ రుసుము రూ.25వేలు పంపించాలని శ్రీకాంత్ కోరాడు. సదరు వ్యక్తి గూగుల్‌పే ద్వారా రూ.25 వేలు రెండు విడతల్లో పంపించాడు. ఫోన్‌చేస్తే ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నేరస్తుడిని అరెస్టు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నీరేష్

చేయూత.. ఉపాధి

మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ.83 కోట్ల రుణాలు

- డిజిటల్ పద్ధతిలో నెలవారీగా చెల్లింపులు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వివిధ రంగాల్లో ఉపాధి పొందుతున్న అతివలు

సంగారెడ్డి టౌన్: మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు ప్రవేశపెడుతున్నాయి. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. వివిధ వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు వివిధ ఉపాధి అవకాశాలు లభించేలా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. మహిళలకు కిరాణా దుకాణాలు, టెంట్ హౌస్, కోళ్ల పరిశ్రమ, డెయిరీ ఫామ్, వివిధ చిన్న తరహా వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని మహిళా సంఘాల ద్వారా లబ్ధి పొందుతూ జీవనోపాధి పొందుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో స్త్రీనిధి ద్వారా ఈ సంవత్సరంలో రూ.83 కోట్ల రుణాలు మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. జిల్లాలో 25 మండలాలు, 365 గ్రామ సంఘాల్లో 10,016 మంది సభ్యులకు స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణాలిచ్చారు. స్త్రీ నిధి నుంచి రుణాలు పొంది స్వయం ఉపాధి పొందడంతో పాటు ప్రత్యక్షంగా పరోక్షంగా మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణాలకు ప్రతి నెల ఆన్‌లైన్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించడంతోపాటు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు.



డిజిటల్ పద్ధతిలో డబ్బులను చెల్లించిన మహిళా సంఘం సభ్యులు


మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళా సంఘంలోని సభ్యులకు స్త్రీ నిధి ద్వారా రుణాలిస్తూ వ్యాపారాలు చేయడానికి ప్రోత్సహిస్తున్నాం. తీసుకున్న డబ్బులను ప్రతి నెల ఆన్‌లైన్‌లో సకాలంలో చెల్లిస్తున్నారు. మహిళలకు మరింత అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. వంద శాతం రుణాలు అందజేశాం.



- శ్రీనాథ్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్


ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్న



స్త్రీ నిధి ద్వారా మూడు లక్షల రుణం తీసుకున్న. ఆ డబ్బుతో ఫ్యాన్సీ స్టోర్ దుకాణం ఏర్పాటు చేసిన. తీసుకున్న రుణాన్ని ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాను. అలాగే పొదుపులో కూడా ప్రతి నెలా డబ్బులు కడుతున్నాం. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీనిధి ఉపయోగపడుతుంది.

- సరస్వతి, తాలేల్మా గ్రామం, అందోల్


శుభకార్యాలకు డెకరేషన్



స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకున్న. ఈ డబ్బులతో వివాహాలకు సంబంధించిన డెకరేషన్ వస్తువులను కొనుగోలు చేశా. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నా. శుభకార్యాలకు డెకరేషన్ నిర్వహిస్తూ మంచి ఆదాయం పొందుతున్న.

- పద్మ, దేవుని గ్రామం, వట్టిపల్లి

మంచి అవకాశాలు



మహిళా సంఘాల్లోని సభ్యులకు మంచి అవకాశాలు ఉన్నాయి. స్త్రీ నిధి ద్వారా మూడు లక్షలు రుణం తీసుకొని సొంతంగా టెంట్ హౌస్‌ను నడుపుతున్న. గ్రామంలోనే ఉంటూ వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు సామాన్లు ఇస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తున్నాను.

- లక్ష్మి, ఇస్మాయిల్ ఖాన్‌పేట్, సంగారెడ్డి